క్లుప్తంగా

నిరుద్యోగ భృతి ఎక్కడ?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఎప్పుడు ఇస్తారని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నగర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు అవుతున్న నిరుద్యోగ యువత పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. పది సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ బ్లాక్ లాక్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ పోస్టుల నియామకాలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తక్షణమే ఎస్సీ ఎస్టీ బ్లాక్ లాక్ పోస్టులను విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి 12 సంవత్సరాలు అవుతున్న నేటికీ రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన కర్నూలు పర్యటనకు రావడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు డి. ప్రదీప్ సిహెచ్. శివ నాగేంద్ర , నగర నాయకులు నాగార్జున, నరేష్, తిమ్మప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచిస్తే.. జీవితం ఆనందమయం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం ఆనందమయంగా సాగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. సునీత అన్నారు. ఆదివారం యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యూనిట్-4, 7 వాలంటీర్లు పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లి, మిట్టమీద పల్లెలో పలు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ ఎస్. సునీత ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లి గ్రామంలో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు, అంటు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ సైకాలజీ సహాచార్యులు డాక్టర్ కే. లలిత ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై మిట్టమీద పల్లె ప్రజలను, రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలకు ముందుగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అప్లైడ్ మ్యాథమెటిక్స్, సైకాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఫిజిక్స్ డేటా సైన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

భుజంగరావు సేవలు చిరస్మరణీయం



భుజంగరావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు, కుటుంబసభ్యులు

కడప ఎడ్యుకేషన్: మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు పసుపులేటి భుజంగరావు సేవలు చిరస్మరణీయమని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు కొనియాడారు. భుజంగరావు 17వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కడపలోని టీచర్స్ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీచర్స్ భవన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.రాజగోపాల్, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, భుజంగరావు కుమార్తె అనసూయమ్మ, కుటుంబ సభ్యులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని ఆయన సేవలు గుర్తు చేసుకొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు



నృత్యం చేస్తున్న యువకులు

కడప సెవెన్‌రోడ్స్ : నగర శివార్లలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. కడప నగరానికి చెందిన సరేశ్వర్ డాన్స్ అకాడమీ విద్యార్థులు పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పదేపదే సందర్శకులు తన కరతాళ ధ్వనులతో విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనదారులకు జరిమానా

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్ పోస్టు వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలో పది మంది ద్విచక్ర వాహనదారులకు రూ.1850 జరిమానా విధించినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల తనిఖీలో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, ఆర్‌సీ, సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించామని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని చెప్పారు. అతివేగం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఆ దారి.. ప్రమాదాల దరి

నగరంలోని ఎర్రముక్కపల్లె నుంచి బుగ్గ అగ్రహారం వెళ్లే రహదారిలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. కనీసం సూచికబోర్డులు కూడా లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆయా రోడ్లలో ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఈ రహదారిలో కిలో మీటరులో ఏడు మలుపులు ఉన్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ద్విచక్ర వాహనాదారులు, కార్లు అతివేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. చింతకొమ్మదిన్నె మండల ప్రజలు, కడప నగరవాసులు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. ఈ విషయం తెలిసినా ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. -కడప వైఎస్ఆర్ సర్కిల్



స్వామి నగర్ వద్ద మలుపు



సాయిప్రతాప్ నగర్ వద్ద మూల మలుపు

విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కావాలని స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ పి. సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా కమిటీ స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మెలకు సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ జెన్కో యాజమాన్యం, ప్రభుత్వం 20 సంవత్సరాలుగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను తక్కువ వేతనాలిచ్చి శ్రమ దోపిడీకి పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని, 2022 వేతన అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్ సంస్థ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులేషన్స్‌కు భిన్నంగా కొత్త రూల్స్ తెచ్చి, ప్రమోషన్ ఇవ్వకుండా యాజమాన్యం వేధిస్తోందని తెలిపారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని, అపరిమిత మెడికల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

15వ తేది నుంచి ఏపీ జేఏసీ తలపెట్టిన సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా డిస్కాం అధ్యక్షుడు ఎస్. శివశంకర్ మాట్లాడుతూ సమ్మెను నివారించేందుకు యాజమాన్యం, కానీ ప్రభుత్వం గానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్ మాట్లాడుతూ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నాయబ్, కిరణ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. నాగసుబ్బయ్య, ఈ. శ్రీహరి, ఉపాధ్యక్షుడు కేవీ సురేంద్రబాబు, జిల్లా నాయకులు, నాగమల్లయ్య ప్రసాద్, ఎరికల రెడ్డి, సుబ్బరాజు, నాగరాజు పాల్గొన్నారు.

అధికారుల అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ అధికారులు, కార్మికులతో పనులు చేయించుకోవాలే తప్పా.. వారి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కార్మిక పరిషత్ నాయకులు హితవుపలికారు. కార్మిక పరిషత్ గ్యారేజ్ కార్యదర్శి ఖాజాపీర్ పట్ల గ్యారేజ్ ఇన్‌చార్జి, షెడ్యూల్-3 ఇన్‌చార్జి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ నాయకుడు పురుషోత్తం మాట్లాడుతూ ఎంఎఫ్ మొండివైఖరి విడనాడాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల కిషోర్‌బాబు, బి.రాజేంద్ర రెడ్డి, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు జి.లూర్దురాజు, ఎస్.ఖాజాపీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేఆర్ఎస్ రెడ్డి, అన్నయ్య, చంద్రశేఖర్, వి.బాబు, బాలమునెయ్య, సీవీ రమణ, శాంతప్ప, మహేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మిక పరిషత్ నాయకులు

దస్తగిరిపేటలో అధ్వానంగా పారిశుద్ధ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరం 49వ డివిజన్ అలంఖాన్ పల్లి పరిధిలో ఉన్న దస్తగిరిపేటలో స్మశానం నుంచి వచ్చే మురుగు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ తెలిపారు. ఆదివారం దస్తగిరిపేట ప్రాంతాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దస్తగిరిపేట పట్ల కార్పొరేషన్ పాలకవర్గం వివక్ష చూపడం సరైనది కాదని అన్నారు. దస్తగిరిపేటలో మురుగునీరు ప్రవహించడం వలన విష జ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డితో పాటు దస్తగిరి పేట ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.



మురుగు నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజల భద్రతకు 'విజిబుల్ పోలీసింగ్'

కడప అర్బన్: జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు ‘విజిబుల్ పోలీసింగ్’ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

వాహనాల తనిఖీలు

అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచిస్తున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

సన్మానం



మహేశ్వరరెడ్డి సన్మానిస్తున్న సైన్స్ ఫోరం నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్సు టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వరరెడ్డిని సైన్స్ ఫోరం రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం విజయవాడలోని అనిబిసెంట్ రోడ్డులోని కమ్యూనిటీ హాల్లో ఎన్నికల పరిశీలకుడు మద్దలేటి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్సు టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా వైఎస్సార్ జిల్లా మాజీ సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్సార్ జిల్లా తరుపున ఫిజికల్ సైన్సు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్, జిల్లా సైన్సు ఆఫీసర్ వేపరాల ఇమ్మానియేల్ ఎబినైజర్, మహమ్మద్‌బాషా ప్రాతినిత్యం వహించారు.

రాజాసింగ్‌పై చర్యలు తీసుకోండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా మత విద్వేష వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ్యుడు రాజాసింగ్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేసి, చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కమాల్ బాషా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ లో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన ఓ సమావేశంలో ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రసంగిస్తూ మహా ప్రవక్త పట్ల అత్యంత మతవిద్వేషంతో ప్రసంగించారని తెలిపారు. గతంలో కూడా మహాప్రవక్త పట్ల, ఇస్లాం, ముస్లింల పట్ల అభ్యంతరక వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. రాజాసింగ్‌ను అరెస్టు చేయాలని లేని పక్షంలో ముస్లింలంతా ఏకమై ఆందోళనలు చేపడతారని హెచ్చరించారు. రాజాసింగ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందని తెలిపారు.

రైతుల సమస్యకు పరిష్కారం

మైదుకూరు: మండలంలోని వనిపెంట రైతుల సమస్యను అధికారులు ఆదివారం పరిష్కరించారు. వనిపెంట నుంచి చెర్లోపల్లెకు వెళ్లే రహదారిలో మురికి గోవిందమ్మ, సంజీవరాయుడు తదితర రైతులకు చెందిన అరటి, పసుపు, ఉల్లి పంటలు నీట మునిగిన విషయంపై ఆదివారం సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాలతో మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, వనిపెంట రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1647, 1648లోని పొలాలను పరిశీలించారు. సుమారు 20 ఎకరాలలోని నీరు దిగువకు వెళ్లే మార్గం లేక పొలాల్లో నిలిచిందని గుర్తించారు. దిగువ పొలాల రైతులతో మాట్లాడి నీరు దిగువకు వెళ్లేలా కాలువలు తీసేందుకు ఒప్పించారు.

ఫ్లాష్.. ఫ్లాష్

గూడ్స్ రైలు కింద పడి కుటుంబం ఆత్మహత్య







కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఏడాది వయసున్న కుమారుడితోపాటు భార్యాభర్తలు (35) ఆత్మహత్య చేసుకోవడంతో అందరి హృదయాలను కలచివేసింది. విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ సీఐ సుధాకర్ రెడ్డి, ఆర్పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డిలు ఘటనా స్థలి చేరుకుని మృతదేహాలను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

ధైవజనుల సమాజ సేవలు అభినందనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ధైవజనుల సేవలు అభినందనీయమని పాస్టర్ పి.మహేష్ కొనియాడారు. ఆదివారం ప్రపంచ సేవకుల దినోత్సవం సందర్భంగా కడపలోని 48 డివిజన్ కృపా కాలనీలోని ప్రార్థన మందిరంలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన క్రీస్తు సంఘ దైవజనులు కేకే సుధీర్, సిస్టర్ సత్యవతి చేస్తున్న సేవలను అభినందిస్తూ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ దైవజనులు కేకే సుధీర్ ఎంతోమందిని చెడు వ్యసనాలకు బానిసైన వారిని దైవ వర్తమానం ద్వారా సన్మార్గంలో నడిపిస్తున్నారన్నారు. అదేవిధంగా ఎంతోమందిని క్రీస్తు బోధనల ద్వారా సమాజంలో మార్పు తీసుకొస్తున్నారని ప్రశంసించారు. ఆయన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. వి.సుభాష్ చంద్రబోస్, వి. కిరణ్, పి. రవితేజ, జాన్సన్, సిస్టర్ సుదీప, బ్రదర్ సుధీష్ పాల్గొన్నారు.



కేకే సుధీర్, సిస్టర్ సత్యవతిని సత్కరిస్తున్న పాస్టర్ మహేష్

ఆధ్యాత్మిక సేవకు పునరంకితం కావాలి

కడప రూరల్ : క్రైస్తవ ఆధ్యాత్మిక సేవలో పాస్టర్లు పునరంకితం కావాలని బిషప్ డాక్టర్ కె శామ్యూల్ బాబు అన్నారు. ఆదివారం కడప శివార్లలోని ఆర్‌కే నగర్‌లో ఉన్న షాలేము ప్రార్థనా మందిరంలో ప్రపంచ పాస్టర్ల ప్రశంసా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి పాస్టర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన బిషప్ శామ్యూల్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని హితవు పలికారు. ఆనాడు క్రీస్తు తన 12 మంది శిష్యులకు హితోపదేశం చేసిన శాంతి సందేశాన్ని ఆయన గుర్తు చేశారు. సర్వలోకాలకెళ్లి ప్రేమ సువార్తను ప్రకటించాలని ఏసుక్రీస్తు బైబిల్‌లో చెప్పాడని పేర్కొన్నారు. అనంతరం సంఘ పెద్దలు బిషప్ కె. దానం, రెవ కె. స్వర్ణన్ రత్న కుమార్, బిషప్ కె. శామ్యూల్ బాబును సన్మానించారు. కే. ప్రణూష, కేఎస్ రాజకుమారి, కే. హెబ్సిబా, కే. సుమ, కే. ప్రణీత్ పాల్గొన్నారు.

విభజన హామీల సాధనకు ఉద్యమం

కడప ఎడ్యుకేషన్: విభజన హామీల అమలు కోసం ఉద్యమానికి సన్నద్ధం కావాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున పిలుపునిచ్చారు. ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ నేటికీ శంకుస్థాపనకే పరిమితమైందన్నారు నిత్యం కరువు, వలసలు, ఆత్మహత్యలతో అల్లాడుతున్న సీమ ప్రాంత ప్రజల ఘోష పాలకవర్గాలకు కనబడడం లేదని మండిపడ్డారు. రాయలసీమ సమగ్రాభివృద్ధికి రూ. 100 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ ప్రెసిడెంట్ గూడూరు రామచంద్ర, వేముల మండల అధ్యక్షుడు జి. రామకృష్ణ, డి. భక్తాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అవ్వారు మల్లికార్జున

పెన్షన్‌లో సంస్కరణలకు స్వస్తి చెప్పాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పెన్షన్‌లో సంస్కరణలకు స్వస్తి చెప్పాలని అఖిల భారత పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జనార్దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో పెన్షనర్ల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కరణల పేరుతో పెన్షన్ సౌకర్యాలపై దెబ్బ కొట్టే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత న్యాయస్థానం పెన్షన్ భిక్ష కాదు, ఒక హక్కు అని గతంలో తేల్చి చెప్పినా కూడా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి దయా దక్షిణాలతో పెన్షన్ ఇస్తున్నట్లు భావించి పెన్షన్ రూపకల్పనలు చేసి మోసాలకు పాల్పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు త్వరలో పీఆర్సీని అమలు చేసి డీఏలు విడుదల చేయాలని కోరారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌దారుల సమస్యలపై డిసెంబర్ 10న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జిల్లా సదస్సులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సత్తిరాజు, రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా ఎన్జీవో మాజీ నాయకులు రామ్మూర్తి నాయుడు, కల్యాణ్ సుధాకర్, హరిచంద్రారెడ్డి, బాలభయన్న, సుధాకర్, ఏ. రామలక్ష్మణ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిల భారత పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు జనార్దన్‌రెడ్డి

సాహిత్యాభివృద్ధికి 'బంగోరె' కృషి ఎనలేనిది

కడప ఎడ్యుకేషన్: సాహిత్యాభివృద్ధికి రచయిత బండి గోపాలరెడ్డి ఎనలేని కృషి చేశారని కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి కొనియాడారు. సాహిత్యరంగంలో 'బంగోరె' పేరుతో ఈయన ప్రసిద్ధి చెందారని తెలిపారు. బండి గోపాల్‌రెడ్డి 88వ జయంతిని ఆదివారం కడప రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కొండారెడ్డి మాట్లాడుతూ వేమన, సీపీ బ్రౌన్, మహాకవి గురజాడతోపాటు పలువురి సాహిత్య జీవితాలపై బంగోరె పరిశోధనలు చేశారని తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన బ్రౌన్ రీసెర్చ్ ప్రాజెక్టు ద్వారా సీపీ బ్రౌన్ సాహిత్య చరిత్రను, బ్రౌన్ లేఖలు-ఆధునికాంధ్ర సాహిత్య చారిత్రక శకలాలు అనే గ్రంథాలను గోపాలరెడ్డి వెలుగులోకి తెచ్చారని గుర్తుచేశారు. సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, కవి డాక్టర్ వెంకటేశ్వరాచారి, గుడ్ల ఆదినారాయణరెడ్డి, మద్దిక సుబ్బిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రెడ్డి సేవాసమితి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.



బండి గోపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లెక్కల కొండారెడ్డి తదితరులు

ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, ఆరోగ్య శ్రీ సేవలు కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్ కోరారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు నిధులు విడుదల చేయలేదని, ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేశారని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల డాక్టర్ల సమ్మెతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ‘ఆరోగ్యశ్రీ’ అనారోగ్యశ్రీగా మారిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్షుడు పి. సుబ్బరాయుడు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మరియమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్

పీహెచ్‌సీ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పీహెచ్‌సీ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపుమేరకు ధర్నా నిర్వహిస్తున్నామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యు.మరియమ్మ తెలిపారు. ఆదివారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తలకు మెరుగైన వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో ఆశా కార్యకర్త మరణిస్తే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ. 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఉచితంగా కల్పించాలని కోరారు. ఈ ధర్నాను ఆశా కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళల రక్షణకే శక్తి యాప్

కడప అర్బన్: మహిళల రక్షణకే శక్తి బృందాలు ఏర్పాటు చేసినట్లు రిమ్స్ పీఎస్ ఎస్.ఐ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి ఆదివారం సాయంత్రం కడప నగర శివార్ల లోని శిల్పారామం సందర్శకులకు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు, బాలికలకు ఈ శక్తి యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రతి మహిళా విద్యార్థులు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నంబర్ ద్వారా ఫిర్యాదు చేస్తే పది నిమిషాల్లో సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 112, చైల్డ్ లైన్ 1,098, 181, మహిళ వేధింపులు 1,091, సైబర్ టోల్ ఫ్రి 1,930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీలను సంప్రదించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సుభాష్ చంద్రబోస్